క్లుప్తంగా

నేడు ఈలప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని ఈలప్రోలులో శుక్రవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, సాయంత్రం జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరిస్తారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

తిరువూరు: డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభు త్వం మంజూరు చేసిన మూడో విడత వైఎస్సా ర్ ఆసరా నమూనా చెక్కులను శుక్రవారం తిరువూరులో ఎమ్మెల్యే రక్షణనిధి పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో, 11 గంటలకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ముసునూరు: మండలంలోని మహిళా సంఘాలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం డి.రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లకు వివరాలు చెప్పారు. మండల కేంద్రం ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

ఆత్మీయ సత్కారం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో పదవీ విరమణ చేసిన ప్రొడక్షన్ ఇంజినీర్ పత్తిపాటి సంపత్‌కుమార్‌కు ఉద్యోగులు గురువారం ఆత్మీయ సత్కారం చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ వర్క్ షాపులో చార్జ్‌మెన్‌గా ఉద్యోగం ప్రారంభించి వివిధ హోదాల్లో పదోన్నతి పొందిన సంపత్‌కుమార్ తోటి ఉద్యోగులకు ఆదర్శప్రాయమన్నారు. సంపత్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బ్రాంచి అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా చందనోత్సవ ఊరేగింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి పండుగ సందర్భంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరం పాలకమండలి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాలనీ పురవీధుల్లో షిర్డీ సాయిబాబా చందనోత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు సాయిబాబాకు సమర్పించిన చందనానికి నమస్కరించి తమ అభీష్టం నెరవేరాలని కోరుకుంటూ తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఇ వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పీవీ లక్ష్మీ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, పలువురు సాయి సేవకులు పాల్గొన్నారు.

2న రఘునాథస్వామి కల్యాణం

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామి ఆలయంలో ఏప్రిల్ 2వ తేదీ స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు తల్లాప్రగడ విశ్వేశ్వరరావు గురువారం తెలిపారు. ఇక్కడ ద్వాదశి రోజున స్వా మివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆ రోజు రాత్రి 9గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏప్రిల్ 7వరకు స్వామి వారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 3న హనుమంత వాహనంపై గ్రామోత్సవం, 4న స్వామి వారి రథోత్సవం, 5న గరుడ వాహనంపై గ్రామోత్సవం, 6న శేష వాహనంపై గ్రామోత్సవం, 7న స్వామివారి పవళింప సేవ నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

ముసునూరు: పేకాట శిబిరాలపై గురువారం సాయంత్రం దాడులు నిర్వహించి, ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై ఎం .కుటుంబరావు తెలిపారు. వీరిని శుక్రవారం నూజివీడు కోర్టుకు తరలిస్తామన్నారు. లోపూడి శివారు బాసవరప్పాడులో ఇద్దరిని, చింతలవల్లిలో ఇద్దరిని, బలివేలో ఇద్దరిని అరెస్ట్ చేసి, రూ.4,000 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

'నేషనల్ మీన్స్' స్కాలర్ షిప్‌నకు విద్యార్థిని

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రతిష్టాత్మక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు బాపులపాడు మండలం రంగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని గరికిపూడి తేజశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోరిపర్తి రాణి గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం పరీక్ష -2023లో తేజశ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు.



పొదగచెట్ల మండపం వద్ద కల్యాణోత్సవం



చనుబండలో..



మైలవరంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం



గంపలగూడెంలో..



ఆగిరిపల్లిలో కోదండరాముడు

సీతా ప్రాణాధారక రామ..

మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గురువారం మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో శ్రీరామనవమి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. రామాలయాల ఆవరణలు రామనామంతో మార్మోగాయి. రామాలయాలు, మండపాలు, కూడళ్ల వద్ద ఏర్పాటుచేసిన చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణాన్ని భక్తులు తిలకించారు.

- ఘనంగా శ్రీరామనవమి
- ఊరంతా రామమయం



లోపూడి కోదండ రామాలయంలో కల్యాణ మహోత్సవం



గంపలగూడెం రామాలయం వద్ద కల్యాణ పీటలపై దంపతులు

తిరువూరు/మైలవరం/నూజివీడు: నూజివీడులోని పాతపేట సూరిరామమందిరం, కొత్తపేట సుతార్ల రామమందిరం, సిబ్బందిపేట కోదండరామాలయం, మైలవరం రోడ్డులోని ముసలిరామ మందిరం, ట్రిపుల్‌ఐటీ సమీపంలోని రామాలయం, పెద్దగాంధీబొమ్మ సెంటరులోని సీతారామాలయం, కొప్పుల వెలమపేట, బొండిలీపేటలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు.

→ ఎన్నెస్పీ కాలనీలో శ్రీరామనవమి ఉత్సవాలు

ఎన్నెస్పీ కాలనీలో ఈఈ కార్యాలయ ఆవరణలో శ్రీరామనవమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన కల్యాణ వేడుకలు జరిగాయి. ఎన్నెస్పీ ఈఈ రెడ్డెం అప్పారావు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ టి.శ్రీనివాసబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

→ ముసునూరులో

ముసునూరు: ముసునూరులోని చారిత్రక వెంకటాచల స్వామి దేవస్థానం, తూర్పు, పడమర రామాలయాలతోపాటు, ముసునూరు మండలం వేల్పుచర్ల, గోపవరం, కాట్రేనిపాడు, గోగులంపాడు, రమణక్కపేట, చెక్కపల్లి, లోపూడి, బాసవరప్పాడు, గుడిపాడు తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రధానార్చకులు కిరణ్ కుమార్ స్వామి

చనుబండ కోదండ రామాలయంలో..

చాట్రాయి: అపర భద్రాద్రిగా పేరు గాంచిన చనుబండ శ్రీ కోదండ రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణ వైభవంగా నిర్వహించారు. సుదర్శనం మదన్ శ్రీనివాసాచార్యులు కల్యాణ ఘట్టాన్ని వివరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు స్వామి వార్లకు తలంబ్రాలు సమర్పించారు. చెన్నకేశవరెడ్డి దంపతులు, ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ దంపతులతో పాటు మరో 25 మంది దంపతులు పెళ్లి పీటలపై కూర్చున్నారు. బూరుగుగూడెం రామాలయంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ దంపతులు కల్యాణం చేశారు. మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాట్రాయిలో సర్పంచ్ దామెర ఉషా, దామెర ప్రసాదు బాబుల పాల్గొన్నారు. చాట్రాయి, పర్వతాపురం, చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో అన్నదానాలు చేశారు.

నేడు మహా పట్టాభిషేకం

కోదండ రామాలయంలో శుక్రవారం మహా పట్టాభిషేకం చేస్తున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టాభిషేకం అనంతరం అన్నదానం చేస్తామని చెప్పారు. రాత్రి 10 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

లోపూడిలో కల్యాణం చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యాన అన్నదానాలు జరిగాయి.

→ తిరువూరురూరల్: మల్లేల, అక్కపాలెం, మునుకుళ్ల, వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం, ముష్టికుంట్ల, గానుగపాడు, చౌటపల్లి, కోకిలంపాడు, లక్ష్మీపురం, కాకర్ల, రోలుపడి, చింతలపాడు గ్రామాల్లోని దేవాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

→ జి.కొండూరు: జి.కొండూరు శ్రీ కోదండ రామాలయంలో ఆలయ నిర్వాహకులు పెదగమ్మళ్ల నాగరాజు ఆధ్వర్యాన సీతారాముల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

→ తిరువూరు: స్థానిక శ్రీకోదండ రామాలయం, రాజుపేట, చీరాల సెంటర్, జగన్నాథపురం కాలనీల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు, శ్రీషిర్డీ సాయి మందిరం, శ్రీవేంకటాచలస్వామి దేవస్థానం, పాతతిరువూరు రామాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు భద్రాచలం వెళ్లి వచ్చే యాత్రికులకు బస్టాండు సెంటర్లో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

→ రెడ్డిగూడెం: కొత్తరెడ్డిగూడెం గ్రామంలోని రామాలయంలో, రెడ్డిగూడెం ఆంజనేయస్వామి దేవాలయంలో ఉత్సవ విగ్రహాలకు గురువారం కల్యాణం చేశారు. రెడ్డిగూడెంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా కల్యాణం జరిగింది. మండలంలోని మద్దులపర్వ, కూనపరాజుపర్వ, బూరుగగూడెం గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

→ ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, కృష్ణారావుపాలెం, ఎ.కొండూరు, కంభంపాడు, గొల్లమందల, రామచంద్రాపురం, రేపూడి, గోపాలపురం పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాములవారికి ప్రత్యేక పూజలు చేశారు.

→ ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సీతారామ చంద్రస్వామి వార్లకు శ్రీరామ నవమి సందర్భంగా దివ్య తిరు కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆగిరిపల్లికి చెందిన ముదిరాజ్ సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించగా భక్తుల జయజయ ధ్వానాల మధ్య పొగడ చెట్ల మండపం వద్ద స్వామివార్లను ఆశీనులు చేసి తిరు కల్యాణాన్ని శోభనాచల ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు ఆధ్వర్యంలో వైభవంగా జరిపించారు.

→ స్థానిక శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉన్న సీతా రామస్వామికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. కోదండ రామాలయంలో ఆలయ అర్చకులు వేదాంతం రవి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. నెక్కలం అడ్డరోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం, శోభనాపురం రామాలయం, కొత్త ఈదర, సీతారామపురం రామాలయాల్లో శ్రీరాముని కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి సూరి శర్మ, వేద విద్యార్థులు పాల్గొన్నారు. నరసింగపాలెం, నూగొండపల్లి, వడ్లమాను గ్రామాల్లో అన్నదానం చేశారు. చిన్న ఆగిరిపల్లిలో భక్తులకు అన్నదానం, వస్త్రాల నిర్వాహకులు పొన్నం లక్ష్మణరావు బహూకరించారు.

→ విస్సన్నపేట: స్థానిక బస్టాండ్ సెంటర్, సత్తుపల్లి రోడ్డులోని రామాలయం, పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రామాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న రామాలయాల్లో ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సం నిర్వహించి భారీగా అన్న సమారాధనలు చేశారు. వేమిరెడ్డిపల్లి పంచాయతీ హనుమత్పురిలో సీతారామ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో కల్యాణోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పుట్రేల మారెమ్మ దేవస్థానం చైర్మన్ కె.సునీల్‌బాబు పాల్గొన్నారు.

→ మైలవరం: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, నూజివీడు రోడ్డులోని శ్రీకోదండ రామాలయం, రామకృష్ణ కాలనీలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం, భద్రాచలం రోడ్డులోని శ్రీఆంజనేయస్వామి ఆలయం, శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం, తిరువూరు రోడ్డులోని మారుతీ కల్యాణ మండపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీసీతారామ స్వామి వార్ల కల్యాణం కనుల పండువగా జరిగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

→ గంపలగూడెం: గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, భజన మందిరం, మేడూరు, పెనుగొలను, ఊటుకూరు, అనుముల్లంక, గాదెవారిగూడెం, దుందిరాలపాడు రామాలయాల వద్ద, తోటమూల, ఆర్లపాడు, కొత్తపల్లి, సత్యాపాడు, చల్లగుండ్లవారిపాలెం, కొణిజెర్ల, నెమలి, గోసవీడులలో ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణాల్లోనూ, తునికిపాడు, కనుమూరు సెంటర్లో నిర్వహించిన శ్రీరామచంద్రుని కల్యాణం కనుల విందుగా నిర్వహించారు. పలుచోట్ల మధ్యాహ్నం మహా అన్నదానం చేశారు. గంపలగూడెం రామాలయం వద్ద సాయంత్రం నిర్వహించిన తిరునాళ్ల కోలాహలంగా సాగాయి.

→ ఇబ్రహీంపట్నం: ఫెర్రీలోని కోదండ రామాలయం, ఇబ్రహీంపట్నం ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, కొండపల్లి చెన్నకేశవ రామాలయం, తుమ్మలపాలెం, కిలేశపురం, కేతనకొండ, కొటికలపూడి, గుంటుపల్లి రామాలయాల వద్ద కల్యాణ వేడుకలు కమనీయంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

'పది' పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

మూడో తేదీ నుంచి మొదలు



ఈదులగూడెంలో పదో తరగతి పరీక్షల కోసం చదువుకుంటున్న విద్యార్థులు

ఆగిరిపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే నెల మూడో తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 564 మంది ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే గతంలో ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లు ఉండేవి. ఈసారి ప్రతి సబ్జెక్టుకు ఒక పేపరు చొప్పున ఆరు పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. పరీక్షలకు గడువు సమీపించడంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పరీక్షల సమయంలో కొన్ని మెలకువలు పాటిస్తే ఒత్తిడిని జయించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

అవగాహన.. సాధన

ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులు అవగాహనతో సాధన చేయాలి. తద్వారా ఆయా పాఠ్యాంశాలపై పూర్తిగా పట్టు సాధించాలి. ఉపాధ్యాయుల సూచన మేరకు నడుచుకోవాలి. తెలుగు సబ్జెక్టును కొందరు అశ్రద్ధ చేస్తుంటారు. అలా కాకుండా దీనిపైనా శ్రద్ధ వహించాలి. మార్కుల సాధనలో ప్రతి మార్కు కీలకమని గ్రహించాలి. హిందీలో పేరాగ్రాఫ్ ప్రశ్నలు బాగా చదివి రాయాలి. ఇంగ్లిష్ ప్రాజెక్టులను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుంటే సమాధానాలు సులభంగా రాయవచ్చు. సైన్స్, సోషల్, పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందాలంటే ముందు నుంచి పక్కాగా చదవాలి. గణితంలో అరమార్కు, మార్కు బిట్లపై దృష్టి పెట్టాలి. వాస్తవ సంఖ్యల చాప్టర్ ద్వారా మార్కులు సులభంగా పొందవచ్చు. పరీక్ష సమయానికి ముందు కొత్త ప్రశ్నలు చదవడం కంటే చదివిన వాటిని తిరిగి చూసుకుంటే మంచిది. ప్రశ్నపత్రంలో ముందుగా వచ్చిన సమాధానాలను రాయాలి. తర్వాత మిగతా వాటిని రాయడం ద్వారా ఒత్తిడి పెరగదు.

నూజివీడులో ప్రశాంత నిర్వహణకు..

నూజివీడు: ఏప్రిల్ 3 నుంచి 18 వరకు నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నూజివీడు డివిజన్‌లో ప్రశాంతంగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు డీవైఈఓ ఎం సేవ్యా తెలిపారు. డివిజన్‌లోని నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో 3478 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారని, మొత్తం 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వీటిలో నాలుగు పరీక్ష కేంద్రాలు సి కేటగిరికి చెందినవన్నారు. నూజివీడు పట్టణం, మండలం నుంచి 1,789 మంది, ముసునూరు నుంచి 619 మంది, ఆగిరిపల్లి నుంచి 599 మంది, చాట్రాయి నుంచి 471 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. సైన్స్ సబ్జెక్టు మినహా మిగిలిన పరీక్షలకు ఒక్కొక్క పేపర్ మాత్రమే ఉంటుందన్నారు. సైన్స్‌కు ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లు ఉంటాయని చెప్పారు. మాస్ కాపీయింగ్, పేపర్ల లీకేజీని అరికట్టడానికి ప్రభుత్వం ప్రతి పరీక్ష పేపర్‌పై ఏడంకెల ప్రత్యేక నెంబర్ ముద్రించిందన్నారు. పరీక్ష కేంద్రాలకు సీఎస్‌లను, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను, ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



పదో తరగతి విద్యార్థులు ప్రశాంతగా పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. భయం లేకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. – పి.రత్నకుమార్, ఎంఈఓ, ఆగిరిపల్లి మండలం

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఇంటింటి సర్వే

కనిమెర్ల తండా(మైలవరం): మండలంలోని కనిమెర్ల తండాలో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు గురువారం తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో దత్తత గ్రామం కనిమెర్ల తండా, వెదురుబీడెంలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో 15 నుంచి 29 సంవత్సరాల వయసున్న యువతీ యువకులు చేస్తున్న పనులపై సర్వే నిర్వహించారు. సర్వేలో 30శాతం మంది యువతీయువకులు చదువు మానేసి కూలి పనులకు వెళుతున్నట్లు తేలిందని ప్రిన్సిపాల్ తెలిపారు. దీనిపై వలంటీర్లు విద్య ప్రాముఖ్యం, ఉద్యోగావకాశాలపై యువతకు తెలియజేసి చైతన్య పరిచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఆఫీసర్ ఉమామహేశ్వరరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష కిట్లు అందుకున్న విద్యార్థులు

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో గురువారం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్‌తో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. కాలనీకి చెందిన తిరివీధి రాంబాబు ఆర్థిక సౌజన్యంతో 27 మంది విద్యార్థులకు ఈ కిట్‌లను ఎంఈఎఫ్ అధ్యక్షుడు బొక్కినాల కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈఎఫ్ నాయకులు ఎలీషా దేవసహాయం, యూత్ సభ్యులు వల్లూరి చక్రవర్తి పాల్గొన్నారు.

నేటితో వడ్డీ రాయితీ గడువు ముగింపు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో ఇంటి పన్నుల చెల్లింపునకు ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ గడువు శుక్రవారం ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఆస్తిపన్ను చెల్లించని వారు శుక్రవారం ఉదయం 8 నుంచి రాత్రి 10గంటల వరకు వడ్డీ రాయితీతో కట్టొచ్చని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం, పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, మీ ఇంటికి వచ్చే సచివాలయ సిబ్బందికి వడ్డీ రాయితో ఇంటిపన్ను చెల్లించాలని సూచించారు.

సామాజిక చైతన్యానికి కళలు దోహదం



కార్యక్రమంలో విద్యార్థుల అభినయం

గుణదల (విజయవాడ తూర్పు): కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా లలిత కళల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్ అన్నారు. కళాశాల ఆవరణలో అభినయ – 2023 కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి సంప్రదాయాలలో లలిత కళలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. సామాజిక చైతన్యానికి కళలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. సంగీతం, సాహిత్యం, రచన, అభినయం వంటి అంశాల్లో విద్యార్థులు అభిరుచితో నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించడానికి తమ కళాశాల పలు కార్యక్రమాలను రూపొందిస్తోందని వివరించారు. దీనిలో భాగంగా అభినయ – 2023 కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సెల్ ఫోన్ వినియోగంతో కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణ, వంటి అంశాలను ముఖాభినయం ద్వారా ప్రదర్శించి చక్కని ప్రతిభ కనబరిచారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్ర, ప్రిన్సిపాల్ ఒ.మహేష్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి వాటర్‌ట్యాంకర్ బహూకరణ



గుడిపాడులో వాటర్ ట్యాంకర్‌ను అందజేస్తున్న 'తపన' చౌదరి

ముసునూరు: గ్రామ ప్రజల మంచినీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంకర్‌ను బహూకరిస్తున్నట్టు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పేర్కొన్నారు. గుడిపాడు కోదండ రామాలయం వద్ద గురువారం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఆయన పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో ట్రాక్టర్ ద్వారా నడిపే మంచినీటి ట్యాంకర్‌ను పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.